నిలుచుండిపోయింది జవరాలు. యువకుడు—" ఒక్కముద్దు " అన్నాడు గుసపం జారేసి—ఏమిజత !

పునాది పై అంచుని ముసిలివాడు—" ఆకలి ! చలి !" యని అంటూ తొంగిచూస్తూ ఏదో అనబోయి, సిరసిల్లి— " నేనున్నూ అలాగే పునాది తవ్వులోనే తొలిముద్దు దొద్ద గొన్నాను ! రాదది మళ్ళీని !" అని చవ్వగా చప్పరించి వొక్క పెద్ద నిట్టూర్పు నింగిని నిలిచివున్న లెక్కచుక్కలకేసి విడుస్తూ విష్ణుపథం సాధించాడు.

.... ... ... .... ....

## ఉత్ప్రేక్షలు - ఉత్తుత్తి కబుర్లు

నేనోరోజున కాలినడకను రాజమండ్రిలో నడుస్తూన్నాను. సర్వ సాధారణంగా కాలినడకనే వెడుతూంటాను. కాని ఆ రోజున సాగడంలో, ఒక ప్రయోజనం ఆసించి నావిహారం పొడిగించాను. అదేమీలేదు !—" వచ్చిన వరద ఏలాగూ వచ్చింది, తెచ్చిన నష్టం ఏలాగూ తెచ్చింది నదీమతల్లి ! అది ఎక్కడ గండి కొట్టిందో ఆ స్థలమైనా చూడవద్దా ?"—అని—ఏదో గమ్య స్థానం పెట్టుకు, అదే పోవడం పోయాను పోతగట్టంట !

పోతూవున్నకొద్దీ, పొడూగుతా—" చిన్నగండి పెద్ద గండి, అబ్బోరబ్బో ! ఎంత గండిపడింది !" అనేలా స్మశానాల చింతకాడపడ్డ మహాగండి కనబడింది. బంటావాళ్లు ఊరికే తవ్వి పోసేస్తూన్నారు పొలంలో మట్టితీసి గట్టున ; కంకరరాళ్లు మట్టేస్తున్నారు ; ఎంజినీర్లు తనిఖీ చేస్తున్నారు ; కంట్రాక్టర్లు

సరఫరా చేస్తున్నారు. మఱి నది వెనక్కి వెళ్ళినకొద్దీ, చెడుగుడు ఆటలో కవ్వింపులాగ దాపుగా ' దన్నుగా ' కంచె కంప వస్తేస్తున్నారు. అక్కడున్న ఒక్కడికీ ఊపిరాడటంలేదు. పని అంత ఉక్కిరి బిక్కిరిగా వుంది.

ఒకడుమాత్రం, ఏటాగ్గా నిలుచుంటే నిలువున్నర వున్నాడా అని అనిపించి పొడవుతో అంతకుతగ్గ వెడల్పుగల ఛాతీతో, ఎటుచూచినా కండే అన్నట్లు మండతిరిగి, దండతిరిగి, దైవికంగా అలవడ్డ ఆరోగ్యమా అన్నంత అసమానదార్ఢ్యంగల నడుం మెడగలిగి, భుజమ్మీద ఒక పారవేసుకు అట్టే నిలబడి పోయాడు.

" మాతో కలబడ్డానికి వచ్చావా ? పనితో కలబడ్డానికి వచ్చావా నీవు ?" అని అడిగేరు దంటావాళ్లు, ఆ విగ్రహపుష్టి నైవేద్యనష్టిలా దోచేవాణ్ణిచూచి. వాడు వెంటనే అన్నాడు—
" నేనొంటిగాణ్ణి, మీరు పదిమంది, మీతో కలబడగలనా ?"
" అయితే పారుచ్చుకు పనిసెయ్యి !" అన్నారు కూలీలు.
" ఓరయ్య ! ఈపారకీపని సాలదు. ఇది—' విజేనగర 'ప్పార !" అన్నాడు వాడు. దానిమీద కంటరాక్టరు—" అవితే, విజేనగరం నుంచి పార బుజాన్ని వేసుకు ఇంతదూరం వచ్చావా ?" అన్నాడు. " మరేంటనుకున్నారు ? ఈ యూరంతా మునిగినా దన్నారు మేడలు కూలాయన్నారు ! మిద్దెలు తేలాయన్నారు ! మనుష్యులు మట్టిలో కప్పడి తప్పలై, తెప్పలై, అప్పరమేశు కెఱిక, ఏమైనారో అన్నారు !—తీరా రయిల్దిగి పారేసుకు మెయినురోడ్డంట వస్తనుగందా—ఒకడూ ఈ పారకు పనిచెప్పిన పాపాన్ని పోలేదు. మేడలాలాగే వున్నాయి. మిద్దెలెప్పట్లాగే

మెరిసేవి. మేకలు, కుక్కలు, ఆవులు, ఆంబోతులు, అన్నీ కాలబడేవి. బస్సులు, దిరాసులు, మామ్మూళ్లోలాగే వున్నాయి. నాపారకొక్కళ్ళూ, అంతదూరం నడచివచ్చినా, ఒక్కళ్ళూ, పనిచెప్పినపాపాన్ని పోలేదు. బుస్సుమంటూ గంగ యీ గండి గుండా వచ్చిందా ?" అంటూ విడ్డూరపోసాగాడు. వెంటనే ఒక వృద్ధుఁడు బంటాపని చేస్తూ చేస్తూ, నడుమెత్తుకు తట్టదులుపుకుంటూ, గట్టెక్కి-"నీవు ఈపొద్దొచ్చినావునాగుంది. ఆపొద్దుంటే తెలిసేది ! తెడ్డుకూ లొంగలేదు. తెరచాపకూ లొంగలేదుపొంగు! కనబడే వంతెనెపై నింకా వొక గజమెత్తు లేచింది గంగ ! వొంగున్నా అంకెలు కనబడలే ! దిగమింగిందంటే నమ్మ వూరు వూరూను !" "మరింతమంది కనబడేరేం ?" అన్నాడు క్రొత్తమనిషి. "ఎలా దిగిమింగిందో అలా ఎగగ్రేంచదంట్రా? మేమంతా ఆ వరదకు మునిగి, మళ్ళా యివలబడి, పనిలో మునిగినవాళ్ళమే ! నీకిష్టముంటే ఒక పారమట్టి ఆ గండి పూడేలా పొయ్యి ! లేకుంటే పో " అన్నాడు.

అంతట్లో ప్రక్కనేవున్న పేపరుమిల్లు అయిదు కూసింది. ఎనిమిది గంటలపని చేసేశాం అంటూ, పొడళ్లు దులుపుకు తలలు దులుపుకు, బంటావాళ్లు, స్త్రీలు పురుషులు, తట్టలుచ్చుకు, పనిముట్లు పుచ్చుకు, చలచలా గట్టెక్కారు. ఒకడు, కుంట కొలిచిన గీతలబద్ద బుజాన్నేసుకు—" నీ వెంత నేసు ? నీఅంద మెంత నేసు ?" అని నడుస్తూంటే, మరొకడు, 'ద్రావిడీ స్తనగతి ' నడచే యెమ్మెలాడివంక అదేచూపుగా చూసేడు. వాళ్ళలో వాళ్ళ కాపరకాయింపులు లెక్కలోకిరావు. ఏపమిటి కాపమిటె, ఏపంచె కాపంచె. ఇతే పాటబడ్డటు, మొగ ఆడ కలిసి మెలిసి కబురాడుకుంటూ పోతగట్టే గాజులమోత చేతు లూపు

కుంటూ పోయేరు. కాని యందరి కళ్ళూ మాత్రం ఒక్కమాటు ఊరికే పారట్టుకు నిలబడ్డ దూరదేశిపోణ్ణి కనుగొన్నాయి !

వా డప్పటికప్పుడే అదో 'సిలూటీ' బొమ్మలా. సూర్యాస్తమానానికి ముందుగా కారునలుపులోనికి, మాఱిపోయి. ఒక వంకర టింకర సమాధిమీద, వెనకా ముందూ చూచుకోకుండా కూర్చుండిపోయాడు.

అసలదంతా వో పెద్ద స్మశానము. ఈ తొ_ర్తనే సూచించాగా ! కాని వరదచేత ఆ స్తలమంతా సర్వసామాన్య సమ్మార్జనం, అంత్యక్రియలతో నిమిత్తం లేకుండా, గాలింపబడి. మురికిలేక ముల్లులేక, ఎక్కడ కాలేసినా చదునే అన్నట్టుంది. ఒక్క పైనిచెప్పిన సమాధిమాత్రం పెద్ద ఎత్తు మేడలా విలసిల్లిపోతూంది. జీవకళతోకూడా వుందా అన్నట్టు ఒక నూతనంగా నాటబడ్డ తులసిమొక్క చైతన్యం గొలుపుతూవుంది. మొక్క మొరాయించుకున్న ఆ సమాధి, దేరామేకులా విశ్రాంతి కళనున్న ఆ పారమనిషి, సమస్తంకూడా సూర్యాస్తమానంకు మునుముందు స్థాపింపబడే జ్ఞాపకచిహ్నాలుగా గాన్పింపసాగాయి.

ఒక్కనిమేషంలో ఆ జాగా జాగృతి మయమైనట్టు, నిశ్శబ్దంపోయినట్టు, నీలనీలాంధకారం గజ్జెలు కట్టుకు ఆవరిస్తు వున్నట్టు, కారణంలేని ఒక మహా ఘంటానాదం మాఱుమ్రోగ తొడగింది. అర్థనారీశ్వరుడా సంధ్యను నిజంగా తాండవ లాస్యాలను జరిపి యీ యీరేడు లోకాల్ని ఏల్తూ వున్నాడా అని అనిపించింది. కోటిలింగాలుకాదు ముక్కోటిలింగాలొక్కమ్మడి కుంభిని అనే గంగాళంలోపోసి గలగల లాడించినట్టు గణగణ మనిపించినట్టు వేడుకైంది.

అటుచూశా డిటు చూశాడు, విజేనగరపు మగవాడు. ఎటుచూసినా ఏబరాసి ఎన్నెమ్మలా చీకటికోణం తప్ప మరోటి తట్టలేః అయినా భయం లేదనుకొన్నాడు చేతిలో పార మెఱుగునే ప్రతిఫలించే కడవంజగడె నిడుపు చిఱు జేవురెంచి, చెవులింకా నిక్కించేడు. తవిలింది చింతక్రింద ఓ సంభాషణః "అదా యీదాకా సంగతిః" అని అనుకొన్నాడు.

అది పారమనిషికి సంభాషణ ఏసలా వినబడింది గాని, దారే పొయ్యేవానికి పాటః

"రాకితే తంగేదు - రేకలా గున్నాదిః
అమ్మగారెట్టార ? - అయ్యగారెట్టార ?
ఆ కొత్తకోక ?
కొవ్వట్టు లేదోలెః - కోరి దొంగాతనమ ?
ఏ రిచ్చినా ఎరువు ? - బారెడా ? మూరెడా ?"

"ఓరోరిః తాకకురః - గోరు దిగుబోచరాః
రారః విర్వానులంః - ఏరంగు దైతేమి ?
మూరెంత యుంటేమి ? - చీరది నీ పేరుః"
"చీరతో జాకెట్టు ?"—

అని చూచేడు ఓరఓర ప్రియుడు.

"ఎస్ అంటె చీరటాః
ఎస్ వన్ బవన్ - అంటేను అన్నిటాః"—

అంది ప్రియురాలు, ఒసిలొసిలిపోయే గోచీ చెంగు కుదుటు పఱచుకుంటూ.

అప్పటికి ఇద్దరూకూడా పదంనుండి వచనంలో పడ్డారు. ప్రియుడు అనేడు—"అన్నీ అంటే పంచికూడానా ?" అని. "ఆఁః పెర్మిట్ వుంటే సరి" అంది. "నీకో పెర్మిట్ నాకో

పెర్మిట్ వుండాలా ?" అన్నాడు. "నీకో పెర్మిట్ వుండాలి ! నాకో పెర్మిట్ వుండాలి ! మఱీన్నీ ఇద్దఱం నిర్వాసులంకావాలి!" అంది ప్రియురాలు. "మనం నిర్వాసులమే కదే, ఇల్లు కూలి, సమాధిపై నున్నప్పుడు" అన్నాడు ప్రియుడు. "ఆలాగనే సొప్పి నాపర్మిట్ నే నడుక్కోగలిగాను. నీకు చెపుదామంటే 'సమాధిమీద మొగుడూ పెళ్ళాలా ?' అని అంటారేమోనని, ఉన్నగోడు చెడకుండా ఇవలకొచ్చాను 'క్యూ' నుండి" అంది. "నీవు నిలబడ్డది మగ 'క్యూ'వా ? ఆడ 'క్యూ' వా !" అని ప్రియుడడిగేడు. "మగ 'క్యూ' అవితే చీరెల్లా ఇచ్చేర్రా? ఆమాత్రం జ్ఞానం లేదూ ? నీకు ?" అని ప్రియుణ్ణి చెంపమీద వొక చిటికెవేసి ఎక్కడలేని ప్రేమ వెలిబుచ్చుతూ ఆ అసుర సంజయొక్క మాయాంధకారంలో స్మశానంలోని సమాధికాడకు జేర్చింది. చేరుస్తూ—"ఈ సమాధి అంటూ ఆ నచ్చినో డెవరో కట్టబట్టి మనకు నిలవ నీడ అమిరింది" అంది ప్రేయసి. ప్రియుడు—"నచ్చినోడు సమాధి కట్టుకు చావడు. బతికున్న వాడే నచ్చినోడికి సమాధికట్టేడు" అంటూ ఎగువ కెక్కేడు తదాశ్రయం మీదకు.

"నిర్వాసుల కేది చెలవిస్తే అదే నీటుగా కనబడద్ది ! ఇది స్మశాన సమాధి. పైపెచ్చు పడిపోతూవుంది చూచారా ?" అన్నాడు పారమనిషి ప్రక్కకుదిగుతూ. "పడిపోతూవుందా ? ఈ సమాధి పడిపోతూవుందా ? వరద తీసిపోనాక పడిపోతూ వుందా ?" అని దీపం జోతి వెలిగిస్తూ, ఆడది పరకాయించి చూచింది. దీపం వెలుగున, చచ్చి సమాధిక్రింద కప్పెట్టబడ్డ వాని ఆత్మ, పైని నిలిచి మాట్లాడేవాళ్ళ ఆత్మలు, ఒక్కచే అన్నట్టు కనబడ్డాయి !

నిలువునా నీరైపోతూ—"మరి గత్యంతరం?" అని తలపోసేరు బ్రతికున్న ముగ్గురు. "అడి నేతిలో పారవుంది! నీవో తట్టుచ్చుకో! నేను మెట్టమీదుండి అందుకునేను! సమాధి పడకుండా ఇసుక కూరుదాం:" అన్నాడు ప్రియుడు. ఆడది—"నే నిప్పుడు తట్ట తేనూతేను! కట్టిన సీర విప్పాలేను! ఇసక్కూరుతాను! గోదారమ్మ నీటితో ఎలా ముంచెత్తిందో ఇసకా, అలాగే ఇచ్చివెళ్ళింది. పారతో పదిలంగా తవ్విపోయరా బాబా!—నీ వెవరవు? ఈ పొద్దు ఈ సమాధి మీదెక్కావు? నీ బరువుకే వారిగిందేమో మా పెద్దలు కట్టిన యీ కట్టడం కూడాను. ఇక మిగిలేదేమిటి?" అంటూ ఆకాశవలయపు పడమటంచుకంటూ అలా అలా కనురెప్పల్ని గుప్పళించింది ఒక్క కన్నీటిచుక్క. ఆ కన్నీటి చుక్కలో కాపడిందా అన్నట్టు కనుగొన్నాడు, చంద్రకళ నొకదాన్ని, తొలిదాన్ని పరదేశి!

అయితే వంకర సెందురు డెంతోసేపుండడు. దీపంజ్యోతి జాగుసేసినకొద్దీ పెద్దదయ్యేటట్టుంది. "పొయ్యి! సమాధి వారక్కుండా, తఱక్కుండా, మరో పారయిసుక!" అని అలసటలువో అడిగింది ఆడది—"మీ దేవూరు బాబా?" అని మళ్ళని. "మాది విజేనగర" మన్నాడు. "అక్కడనుంచి యిక్కడికి కిందుకొవచ్చావు?" అన్నాడు ఆడదాని కూడా కూడా వున్న మగాడు. "ఇదేం సెడ్డపనా?" అన్నాడు పొరుగూరన్న. వణకిపోయారు ప్రియు లిద్దఱూను.

పార బజాన్నేసుకు ఏలా వచ్చాడో అలా పోతగట్టే మఱలిపోయేడు క్రొత్తమనిషి. క్రొత్తమనిషి మఱి వెనక్కన్నా తిరిగిచూడకుండా అనుకునేడు—

" ఏదున్న పమాధి - వాదుండపీరు !
పడిపోమ విడిపోమ ?
ఈపార యిమక - యిదకుంచె పైపలా !
ఉనికి పని పెయ్యాల ! - ఉత్పత్తి కబురులా ?"—
అని ఈలేసుకుంటూ తిరోహితు డయ్యేడు.

.... .... .... .... ....

## అంతులేని రాజమార్గం

అది యొక మహావృక్షం. మఱ్ఱిచెట్టుకాదు, మద్దిచెట్టుకాదు, బూరుగుచెట్టుకాదు, దాని పేరు నాకు తెలియదు. అక్కడున్న వాళ్ళెకళ్ళూ చెప్పలేక పోయినారు. అయినాగానీ దాని స్వరూపం చాలా పెద్దది. చాలా విడ్డూరమైంది. ఎత్తు ఇరవై నిలువులు. వలం కొమ్మలు విడిచి కైవారం కొలిస్తే రావణాసురుడి ఇరవై చేతులు చాలవు కౌగిలించుకోడానికి. పూలుచూడొస్తే నీళ్ళల్లో కనబడే పద్మాలకు, మెఱకను బొడమే బ్రహ్మదండిపూలకూ మధ్యస్థపూలుగా వుంటాయి. నరికితే వేయి వేటులకైనా తఱగని వంటచెఱకు. ఆంజనేయులుకూడా ఊడబెఱకలేని మొదలు. ముళ్ళుకూడా అక్కడక్కడున్నాయి ఏదిపందికున్నట్లు. ఆకులు అతి పచ్చా అతి చిక్కనా. ఆకారానికి కర్రపెండల పాకుల్లాగుంటాయి. కాని ఒకదానిమీ దొకటి, సూర్యకిరణాలు కూడా దూరేందుకు సందులేకుండా, అలా రాంభజన పెమ్మా కొమ్మల్లాగుండడంచేత, అంతరువులుగల మేడెక్కుతూన్నట్టే చెట్టుకెగ్రబాకుతూంటే ! అసలు ఎగ్రబాకే వాడంటూ ఒక డుండాలి. మరిన్ని గ్లోబులు వ్రేలాడేలా వ్రేలాడి పొడుచుకొచ్చే